

నోరు లేని మేకల్నే బలి ఇస్తారు.
సింహాల్ని బలివ్వరు, గుర్తించుకోండి.
- డా. బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జనస్వరం

పవర్ అక్షరమే ఆయుధం ✍

www.Janaswaram.com

జనస్వరం న్యూస్ తెలుగు వారపత్రిక ద్వారా తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్నీ కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి.
మా మెయిల్ ఐడి :
janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 9642067900

సంపుటి : 4 | సంచిక : 284 | ఎడిటర్ : నరేష్ సాకే | వార సంచిక : 28 - 04 - 2025 | పేజీలు : 5


## ఉగ్రదాడి దోషులను వదిలిపెట్టం : నరేంద్ర మోదీ

**- పహల్గామ్ ఉగ్రదాడిపై ప్రధాని మోదీ తీవ్ర స్పందన**
**- దాడికి పాల్పడిన వారికి, కుట్రదారులకు కఠిన శిక్ష తప్పదని హెచ్చరిక**
**- బాధితుల కుటుంబాలకు తప్పక న్యాయం చేస్తామని హామీ**
**- కశ్మీర్‌లో శాంతి, అభివృద్ధిని చూసి శత్రువులు కుట్ర పన్నారు**
**- ఉగ్రవాదంపై పోరులో దేశ ఐక్యతే కీలకమని మోదీ ఉద్ఘాటన**



**డిల్లీ, ఏప్రిల్ 27, జనస్వరం :** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ అమానవీయ చర్యకు పాల్పడిన ఉగ్రవాదులకు, దీని వెనుకున్న కుట్రదారులకు అత్యంత కఠినమైన శిక్ష తప్పదని ఆయన గట్టిగా హెచ్చరించారు. బాధితుల కుటుంబాలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని ప్రధాని భరోసా ఇచ్చారు. ఆదివారం తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 121వ ఎపిసోడ్‌లో జాతినుద్దేశించి ప్రసంగిస్తూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ప్రతి భారతీయుడినీ కలచివేసిందని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. "ఈరోజు మీతో నా మనసులోని మాట పంచుకుంటున్న వేళ, నా హృదయం తీవ్ర వేదనతో నిండి ఉంది. పహల్గామ్ ఉగ్రదాడి ప్రతి పౌరుడి హృదయాన్ని గాయపరిచింది. బాధితుల కుటుంబాల పట్ల ప్రతి భారతీయుడూ తీవ్ర సానుభూతి వ్యక్తం చేస్తున్నాడు. ఏ రాష్ట్రానికి చెందిన వారైనా, ఏ భాష మాట్లాడే వారైనా, ఈ దాడిలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారి బాధను అనుభవిస్తున్నారు" అని మోదీ తెలిపారు. ఉగ్రవాద దాడి చిత్రాలను చూసిన తర్వాత ప్రతి భారతీయుడు ఆగ్రహంతో రగిలిపోతున్నాడని తాను అర్థం చేసుకోగలనని ప్రధాని అన్నారు. "ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారి నిరాశకు, పిరికితనానికి పహల్గామ్ దాడి అద్దం పడుతోంది" అని ఆయన పేర్కొన్నారు.

కశ్మీర్‌లో శాంతియుత వాతావరణం నెలకొంటున్న తరుణంలో, పాఠశాలలు, కళాశాలలు తిరిగి కళకళలాడుతున్న వేళ, అభివృద్ధి పనులు ఊపందుకున్న సమయంలో, ప్రజాస్వామ్యం బలపడుతున్నప్పుడు, పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతున్నప్పుడు, యువతకు కొత్త అవకాశాలు లభిస్తున్నప్పుడు.. దేశ శత్రువులకు, జమ్మూకశ్మీర్ శత్రువులకు ఇదంతా నచ్చలేదని ప్రధాని విమర్శించారు. "కశ్మీర్‌ను మళ్లీ నాశనం చేయాలనే ఉద్దేశ్యంతోనే ఉగ్రవాదులు, వారి యజమానులు ఇంత పెద్ద కుట్ర పన్నారు" అని మోదీ ఆరోపించారు. ఉగ్రవాదంపై జరుగుతున్న ఈ యుద్ధంలో 140 కోట్ల మంది భారతీయుల ఐక్యతే దేశానికి అతిపెద్ద బలమని ప్రధాని నొక్కిచెప్పారు. "ఈ ఐక్యతే ఉగ్రవాదంపై మన నిర్ణయాత్మక పోరాటానికి ఆధారం. ఈ సవాలును ఎదుర్కోవడానికి మన సంకల్పాన్ని మరింత బలోపేతం చేసుకోవాలి. ఒక దేశంగా మనం బలమైన సంకల్ప శక్తిని ప్రదర్శించాలి. ఈ ఉగ్రదాడి తర్వాత యావత్ దేశం ఒకే గొంతుకతో మాట్లాడుతున్న విషయాన్ని నేడు ప్రపంచం గమనిస్తోంది" అని ఆయన అన్నారు. ఈ దాడి ఘటనపై ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సంతాప సందేశాలను ప్రధాని ప్రస్తావించారు. "భారతీయులమైన మనం అనుభవిస్తున్న ఆగ్రహాన్నే యావత్ ప్రపంచం కూడా అనుభవిస్తోంది. ఉగ్రదాడి తర్వాత ప్రపంచవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచ నాయకుల నుంచి నాకు ఫోన్ కాల్స్, సందేశాలు అందాయి. వారంతా ఈ ఘోరమైన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఉగ్రవాదంపై మన పోరాటంలో 140 కోట్ల మంది భారతీయులతో యావత్ ప్రపంచం నిలుస్తోంది" అని మోదీ వివరించారు.

"బాధిత కుటుంబాలకు నేను మరోసారి హామీ ఇస్తున్నాను, మీకు న్యాయం జరుగుతుంది. కచ్చితంగా న్యాయం జరుగుతుంది. ఈ దాడికి పాల్పడిన వారు, కుట్రదారులు అత్యంత కఠినమైన ప్రతిస్పందనను ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.

## షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌కు బిగ్ షాక్.. భూ కేటాయింపులపై సమగ్ర విచారణకు ఆదేశించిన పవన్ కళ్యాణ్

**- వైసీపీ హయాంలో షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్‌కు అటవీ భూముల కేటాయింపు**
**- సత్వరమే నివేదిక ఇవ్వాలని ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**
**- 49.8 ఎకరాలను షిర్డిసాయి సంస్థకు రూ.42.48 కోట్లకు కట్టబెట్టిన వైనం**



**మంగళగిరి, ఏప్రిల్ 27, జనస్వరం :** షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ కంపెనీకి చెందిన భూములు శేషాచలం వైల్డ్ లైఫ్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి వస్తాయని వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఈ మేరకు పీసీసీఎఫ్‌కు ఆదేశాలిస్తూ విచారణ చేసి సత్వరమే నివేదిక అందజేయాలని సూచించారు. షిర్డిసాయి కంపెనీకి కేటాయించిన భూముల్లో అటవీ భూముల క్రమబద్ధీకరణ చట్టం 1980 నిబంధనలు పూర్తిగా విస్మరించారని, అటవీ చట్టాలను ఉల్లంఘించి కేటాయింపులు జరిపారని వచ్చిన మీడియా కథనాలను ఉప ముఖ్యమంత్రి పరిశీలించి అధికారులతో సమీక్షించారు. భూ కేటాయింపులు, సంబంధిత వివరాలు నివేదిక రూపంలో అందజేయాలని, కేటాయింపుల ప్రక్రియపై వివరాలు ఇవ్వాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.

జగన్ ప్రభుత్వ హయాంలో కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సమీపంలోని ఐటీ సెజ్ భూములను డీనోటిఫై చేయించి దానిలో 49.8 ఎకరాలను షిర్డిసాయి సంస్థకు రూ.42.48 కోట్లకు నామమాత్రపు ధరకు కట్టబెట్టారు. ఆ భూముల విలువ ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం రూ.150 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ భూముల్లో షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ సంస్థ శుచి అల్లాయ్స్ అండ్ కండక్టర్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ స్థాపించింది. అయితే విలువైన భూములను షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌కు అతి తక్కువ ధరకు కట్టబెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పులివెందులకు చెందిన న్యాయవాది టి. జయరామ్ సమాచార హక్కు చట్టం కింద అటవీ శాఖకు ఇటీవల దరఖాస్తు చేస్తూ వివరాలు కోరారు. దీంతో ఆ శాఖ వివరాలు అందించింది. షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ కంపెనీ నిర్మించిన పరిశ్రమ ప్రాంతం శేషాచలం వన్యప్రాణి అభయారణ్యంగా పీసీసీఎఫ్ తన నివేదికలో పేర్కొంది. ఈ మేరకు జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ)కి నివేదికను కూడా సమర్పించింది. సదరు పరిశ్రమ తమ శాఖ పరిధిలోని భూములలో వన్య, అటవీ చట్టాలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టారని తాజాగా గుర్తించారు. అటవీశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసినట్లు గుర్తించిన అధికారులు సదరు సంస్థకు నోటీసులు జారీ చేశారు. ఈ విషయం మొత్తం మీడియాలో రావడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి విచారణకు ఆదేశించారు.

## అటారీ-వాఘా బోర్డర్ వద్ద భావోద్వేగ దృశ్యాలు... తల్లులను వీడి పాక్ వెళ్లిపోయిన పిల్లలు!

**- పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ ప్రయాణ ఆంక్షలు**
**- భారత పాస్‌పోర్ట్‌లున్న తల్లులను పాక్ వెళ్లకుండా నిలిపివేత**
**- పాక్ పౌరసత్వం ఉన్న పిల్లలు, భర్తలతో విడిపోయిన భారతీయ మహిళలు**
**- అటారీ-వాఘా సరిహద్దు వద్ద కుటుంబాల కన్నీటి వీడ్కోలు**
**- ఉగ్రవాదులను శిక్షించాలి, తమను విడదీయవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి**


పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య రాకపోకలపై విధించిన ఆంక్షలు పలు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. పాకిస్థానీ భర్తలను వివాహం చేసుకున్న భారతీయ మహిళలు, తమ పిల్లలతో సహా పాకిస్థాన్‌కు తిరిగి వెళ్లేందుకు ప్రయత్నించగా, సరిహద్దు అధికారులు వారిని నిలిపివేశారు. భారత పాస్‌పోర్ట్ కలిగి ఉండటమే ఇందుకు కారణంగా మారింది. దీంతో పాకిస్థాన్ పౌరసత్వం కలిగిన పిల్లలు, కట్టుకున్న భర్తలు తల్లులను ఇక్కడే వదిలి భారంగా పాక్‌కు పయనమయ్యారు. పంజాబ్‌లోని అటారీ-వాఘా సరిహద్దు వద్ద ఈ హృదయ విదారక దృశ్యాలు చోటుచేసుకున్నాయి. వివరాల్లోకి వెళితే, పాకిస్థాన్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్‌ను భారతీయ మహిళ నబీలా చాలా ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. ఢిల్లీలో ఉన్న తన తల్లిని చూసేందుకు నబీలా, తన భర్త, పిల్లలతో కలిసి భారత్‌కు వచ్చారు. అయితే, పహల్గామ్ దాడి తర్వాత పరిస్థితులు మారాయి. పాకిస్థాన్ పౌరులు తిరిగి తమ దేశానికి వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించడంతో సమస్య మొదలైంది. నబీలా వద్ద భారత పాస్‌పోర్ట్ ఉండటంతో, ఆమెను పాకిస్థాన్ వెళ్లేందుకు అధికారులు అనుమతించలేదు. ఫలితంగా, పాక్ పౌరసత్వం ఉన్న ఆమె పిల్లలు 11 ఏళ్ల జైనాబ్, 8 ఏళ్ల జెనీష్‌లను తండ్రి మహ్మద్ ఇర్ఫాన్ వెంట పాకిస్థాన్‌కు తీసుకెళ్లాల్సి వచ్చింది. తల్లిని విడిచి వెళ్లలేక ఆ చిన్నారులు కన్నీరుమున్నీరయ్యారు. ఇలాంటిదే మరో ఘటనలో, 18 ఏళ్లుగా కరాచీలో నివసిస్తున్న మహ్మద్



ఇమ్రాన్, షర్మీన్ దంపతులు తమ కుమార్తెలతో భారత్‌కు వచ్చారు. షర్మీన్‌కు భారత పాస్‌పోర్ట్ ఉండటంతో ఆమెను కూడా అధికారులు పాక్‌కు వెళ్లేందుకు నిరాకరించారు. భర్త ఇమ్రాన్, పాక్ పౌరసత్వం ఉన్న కుమార్తెలను తీసుకుని వెనుదిరిగాడు. తల్లి లేకుండా వెళ్లాల్సి రావడంతో పిల్లలు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాయి. "భారత పాస్‌పోర్ట్ ఉన్నవారిని పాకిస్థాన్ వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. నా భర్త, పిల్లలు పాకిస్థాన్ పౌరులు. వారిని పంపించి, నన్ను ఇక్కడ ఆపేస్తే నేనెలా బతకాలి?" అని ఓ భారతీయ మహిళ కన్నీటితో ప్రశ్నించారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల కారణంగా అమాయక కుటుంబాలను విడదీయడం సరికాదని వారు వాపోయారు. "ఉగ్రవాదులను కఠినంగా శిక్షించండి, అంతేకానీ వీసాలు ఉండి, చట్టబద్ధంగా వివాహాలు చేసుకున్న మాలాంటి వారిని విడదీయకండి" అని వారు భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అటారీ-వాఘా సరిహద్దు వద్ద ఉన్న మరో వ్యక్తి మాట్లాడుతూ, "చెల్లుబాటు అయ్యే వీసా ఉండి, అక్కడ వివాహం చేసుకున్న వారిని వెళ్లనివ్వాలి" అని కోరారు. ప్రభుత్వ నిబంధనలు అమాయక కుటుంబాల పాలిట శాపంగా మారాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## భారత్, హిందువులపై మరోసారి విషం చిమ్మిన పాక్ ఆర్మీ చీఫ్



పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ దాయాది దేశంపై చర్యలకు ఉపక్రమించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పాక్ నేతలు భారత్‌పై విషం చిమ్ముతూనే ఉన్నారు. తాజాగా పాక్ ఆర్మీ చీఫ్ అసిం మునీర్ భారత్‌పై మరోసారి అక్కసు వెళ్లగక్కారు. రెండు దేశాల మధ్య సిద్ధాంత ప్రస్తావనను తీసుకువస్తూ.. అన్ని అంశాల్లో హిందూ, ముస్లింలు వేర్వేరని వ్యాఖ్యానించారు. మతం, ఆచారాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షల్లో హిందూ, ముస్లింలు వేర్వేరని పేర్కొన్న అసిం మునీర్.. వాటి ఆధారంగానే రెండు దేశాలు ఉండాలనే భావన ఏర్పడిందన్నారు. పాకిస్థాన్ ఏర్పాటుకు పూర్వీకులు ఎన్నో త్యాగాలు చేశారని, వాటిని ఎలా కాపాడుకోవాలో తమకు తెలుసునని ఆయన అన్నారు. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పాకిస్థాన్ మిలటరీ అకాడమీ పాసింగ్ ఔట్ పరేడ్‌లో అసిం మునీర్ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకు ముందు ప్రవాస పాకిస్థానీల తొలి సదస్సులో కూడా మునీర్ ఇదే తరహాలో వ్యాఖ్యలు చేశారు. మనది ఒక దేశం కాదని, రెండు దేశాలు అని అన్నారు. కశ్మీర్ తమ జీవనాడి లాంటిదని ఆయన వ్యాఖ్యానించారు. ఇలా ఆయన వ్యాఖ్యానించిన కొన్ని రోజుల్లోనే పహల్గామ్‌లో ఉగ్రదాడి జరగడం గమనార్హం.

## జీవితం - వి "చిత్రం"




## ఈరోజు పంచాంగం వేళలు

**తేదీ : 28 ఏప్రిల్ 2025**
**తిథి : శుద్ధ విదియ ( మ : 2.01 వరకు )**
**నక్షత్రం : ధనిష్ఠ ( తె 5.52 వరకు )**
**బ్రహ్మముహూర్తం : తె 5.16 నుండి తె 6.01 వరకు**
**రాహుకాలం : ఉ 11.08 నుండి మ 12.33 వరకు**
**యమగండం : మ 3.24 నుండి సా 4.49 వరకు**
**వర్జ్య కాలం : మ 12.37 నుండి మ 2.17 వరకు**

## ఈరోజు నమాజ్ వేళలు

**తేదీ : 28 ఏప్రిల్ 2025**
**ఫజర్ : 5.35 ఉదయం**
**సూర్యోదయం : 6.48 ఉదయం**
**జొహర్ : 12.34 మధ్యాహ్నం**
**అసర్ : 3.52 సాయంత్రం**
**మఘ్రిబ్ : 6.19 సాయంత్రం**
**ఇషా : 7.32 సాయంత్రం**


జనస్వరం
విలేకరులు కావలెను
"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్
జనస్వరం మీడియా



# వైఎస్ జగన్ '2.0' ఇంకో డిజాస్టర్.!

## ఎడిటోరియల్

అధికారం కోల్పోయాక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గడచిన పది నెలల్లో ఏం చేసింది.? ప్రజల తరఫున ఏమైనా ప్రజా ఉద్యమాల్లో కనిపించిందా.? ప్రభుత్వ వైఫల్యాల్ని ఎండగట్టిందా. ప్రతిపక్ష నేత.. అనే హోదా కావాలనుకుంటున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, 'ఆ దిశగా' ప్రజల మెప్పు పొందగలుగుతున్నారా.? 'వైఎస్ జగన్ 2.0' చూడబోతున్నారంటూ వైసీపీ అధినాయకత్వం సంకేలాలు పంపడం, వైసీపీ శ్రేణులు, 'కూటమి కుప్ప కూలుతుంది.. మేమే అధికారంలోకి వస్తాం..' అని భ్రమల్లో బతికెయ్యడం చూస్తూనే ఉన్నాం. జమిలి ఎన్నికలొస్తాయ్.. రెండేళ్ళలోనే.! కాదు కాదు, ఈలోగానే ప్రభుత్వం పడిపోతుంది.! ఇలా ఏవేవో ఊహించేసుకుని, పగటి కలలు కనేస్తున్నారు వైసీపీ నేతలు, కార్యకర్తలు. ఇదంతా నాణేనికి ఓ వైపు మాత్రమే.! వైసీపీని నేతలు ఒకరొకరుగా వీడుతున్నారు. స్థానిక సంస్థలకు సంబందించి ఒక్కో 'కీలకమైన సీటూ' కోల్పోతూ వస్తోంది వైసీపీ. విశాఖ మేయర్ పీఠం సహా, చాలా కీలక పదవుల్ని వైసీపీ కోల్పోగా, కూటమి ఆ అవకాశాల్ని ఒడిసిపడుతూ వస్తోంది. ఇదంతా ఎందుకు జరుగుతోందన్న ఆత్మ విమర్శ వైసీపీ చేసుకోలేకపోతోంది. పొద్దున్న లేస్తే, దుష్ప్రచారం మాత్రమే.. ఎజెండా.. అన్నట్లుగా వైసీపీ వ్యవహరిస్తోంది. దాంతో, వైసీపీ నేతలు, కార్యకర్తల్లోనూ చాలామంది అధినాయకత్వాన్ని అసహ్యించుకునే పరిస్థితి వస్తోంది.

కార్యకర్తల్ని పట్టించుకుంటాం, కార్యకర్తల్ని ఆదుకుంటాం.. అని వైఎస్ జగన్ చెబుతున్న మాటల్ని కార్యకర్తలెవరూ నమ్మడంలేదు.



అంతెందుకు, వైసీపీ ఉప్పు తిన్న, వైసీపీ అను'కుల' మీడియా కూడా, 'జగన్ 2.0'ని తీవ్రంగా తప్పు పడుతుండడం గమనార్హం. విశాఖలో, ఓ సంస్థకు ఇటీవల ప్రభుత్వం ప్రతిపాదించిన భూ కేటాయింపుల విషయమై వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ఆరోపణలు, వైసీపీ క్యాడర్ చేస్తున్న దుష్ప్రచారం.. అంతా ఫేక్ అని తేలిపోయింది. ఇలా ప్రతిసారీ జరుగుతూ ఉంటే, క్యాడర్‌కి కూడా అధినాయకత్వంపై నమ్మకం పోతుంది. వారానికోసారి బెంగళూరు నుంచి హడావిడి చేసి, మీరంతా దుష్ప్రచారానికే పరిమితం కండి.. అని శ్రేణులకు అధినాయకత్వం ఇస్తున్న టాస్కులు, వైసీపీ కొంప ముంచుతున్నాయి.

## నూజివీడులో ఐఎఫ్టీయూ కార్మికుల ఆత్మీయ సమావేశం

**- రెడ్డి అప్పల నాయుడుకు ఘన సన్మానం**

**నూజివీడు, ఏప్రిల్ 27 (జనస్వరం) :** పట్టణంలోని ఎం.ఆర్.అప్పారావు కాలనీలో ఆదివారం ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో కార్మిక నాయకుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. కార్మిక సంఘాల నాయకుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడుకు ఈ సందర్భంగా ఘన సన్మానం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణి బాబు, ఐఎఫ్టీయూ ప్రెసిడెంట్ దేవుడు, ఐఎఫ్టీయూ సెక్రటరీ బోను సాయి, జనసేన సెంట్రల్ ఆంధ్ర కమిటీ సభ్యుడు పాశం నాగబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఐఎఫ్టీయూ కోశాధికారి కామ్రేడ్ నాగరాజు మాట్లాడుతూ, "కార్మిక రంగానికి రెడ్డి అప్పల నాయుడు చేసిన సేవలు అమూల్యమైనవి. ఆయన అనుభవం, నిబద్ధత కార్మిక వర్గానికి గొప్ప మద్దతు" అని పేర్కొన్నారు. సత్కారం అనంతరం రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ, తాను ఐఎఫ్టీయూ ద్వారా పొందిన ప్రోత్సాహమే తన రాజకీయ ప్రస్థానానికి బలమైన వెన్నెముకగా నిలిచిందన్నారు. దాదాపు 30 ఏళ్లుగా శ్రామిక వర్గాల పక్షాన, పేదవర్గాల సమస్యలపై నిరంతర పోరాటం చేశానని తెలిపారు.




కార్మిక హక్కుల కోసం పోరాడిన సందర్భాల్లో అక్రమంగా 3 నెలల పాటు జైలులో గడిపినా, కార్మిక వర్గమే తనకు బలంగా నిలిచిందని గుర్తుచేశారు. ఆయన మాట్లాడుతూ, ఐఎఫ్టీయూ సంస్థ నిబద్ధత, నిజాయితీ ప్రాతిపదికన ఎందరో కార్మిక నాయకులను తీర్చిదిద్దిందని, ఆ వారసత్వాన్ని కొనసాగించేందుకు తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి శ్రీకాంత్, తోట వెంకట్రావు, పగడాల జగన్మోహనరావు, గొల్లపల్లి శ్రీకాంత్, గొల్లపల్లి గిరి, పొన్నూరు నాగబాబు, టిడిపి నాయకురాలు షేక్ నజీమా, ఐఎఫ్టియు అనుబంధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.

## కొల్లేరులో ముంపు వల్ల నష్టపోయిన రైతును పరామర్శించిన ఎమ్మెల్యే ధర్మరాజు

**కొల్లేరు, ఏప్రిల్ 27 (జనస్వరం) :** కొల్లేరు పరిధిలో జీరాయితీ పట్టా గల భూమి (చేపల చెరువు)కు అటవీ శాఖ అధికారులు అక్రమంగా గండికొట్టడంతో నిడమర్రు మండలం పెద నింద్రకొలను, నిడమర్రు గ్రామాల సరిహద్దుల్లో వేంకన్న అనే రైతు మగతకు తీసుకున్న ఏడు ఎకరాల వరిపంట మునిగిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై స్పందించిన ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, స్థానిక నాయకులు, సంబంధిత అధికారులతో కలిసి ముంపు ప్రాంతాన్ని సందర్శించారు. మునిగిపోయిన వరి చేను వద్ద పరిశీలించిన ధర్మరాజు, రాష్ట్ర స్థాయి అధికారులతో వెంటనే ఫోన్ ద్వారా మాట్లాడి పరిస్థితిని వివరించారు. అలాగే, తీవ్రంగా నష్టపోయి విలపిస్తున్న రైతును పరామర్శించి, ప్రభుత్వ పరంగా పూర్తి సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ, "చేతికి అందిన పంట నాశనం కావడం ఎంతో బాధాకరం. రెవెన్యూ శాఖ అధికారులు భూమిని సర్వే చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ,



సమాచారం లేకుండానే అటవీ శాఖ అధికారులు ఏకపక్ష ధోరణితో చెరువులో గండికొట్టడం అన్యాయమని" ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, ఉంగుటూరు ఏఎంసీ చైర్మన్, కూటమి పార్టీల మండల, గ్రామ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## పోలవరం ముంపు నిర్వాసితుల మొర

**- భూములను కాపాడాలని, రహదారి ఏర్పాటు చేయాలని డిమాండ్**



**జీలుగుమిల్లి, ఏప్రిల్ 27 (జనస్వరం) :** పోలవరం ముంపు ప్రాంతం నిర్వాసితులు తమ భూములను కాపాడాలని, నిర్వాసితులకు సురక్షితమైన రహదారి మార్గం నిర్మించాలని కోరుతూ పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజును వారి క్యాంపు కార్యాలయం — జీలుగుమిల్లి/బర్రింకలపాడులో కలిసి మొరపెట్టుకున్నారు. నిర్వాసితుల నాయకులు కాశిక పోతురాజు, కారం వెంకటేశ్వరరావు, మూలేం వెంకన్నదొర, కుంజ లక్ష్మణరావు కలిసి సమస్యలను వివరించారు. భూసేకరణ పేరుతో చేస్తున్న అన్యాయాన్ని తక్షణం ఆపాలని, నిర్వాసితుల ప్రయాణ సౌలభ్యం కోసం తగిన రహదారి మార్గాన్ని అభివృద్ధి చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా నిర్వాసితుల నాయకులు తమ సమస్యలను ఎంపికగా వివరించి, ప్రభుత్వం తమ హక్కులను పరిరక్షించాల్సిన అవసరముందని హైలైట్ చేశారు.

## గుడివాడలో జనసేన క్రియాశీల ఐడీ కార్డుల పంపిణీ




**గుడివాడ, ఏప్రిల్ 27 (జనస్వరం) :** ఆదివారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుండి వచ్చిన ప్రతినిధులతో కలిసి, గుడివాడ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన క్రియాశీల వాలంటీర్స్‌కు జనసేన పార్టీ ఐడి కార్డులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయన రాజేష్, గుడివాడ నియోజకవర్గ జనసేన క్రియాశీల వాలంటీర్స్, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు. వాలంటీర్స్ సేవలు పార్టీ బలోపేతానికి కీలకమని, పార్టీ పరంగా ప్రతి కార్యకర్త ఒక దిశానిర్దేశం పొందేలా ఈ కార్యక్రమం నిర్వహించామని నాయకులు తెలిపారు.

## బావయిపాలెంలో డొక్కా సీతమ్మ చలివేంద్రం



**నిడమర్రు, ఏప్రిల్ 27 (జనస్వరం) :** మండలంలోని బావయిపాలెం గ్రామంలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "డొక్కా సీతమ్మ చలివేంద్రాన్ని" ఆదివారం స్థానిక కూటమి నాయకులతో కలిసి ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ, వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే మిగతా గ్రామాల్లో కూడా జనసేన నాయకులు ప్రజల అవసరాలను గుర్తించి చలివేంద్రాల ఏర్పాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ ముఖ్య నాయకులు, మండల గ్రామ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌కు విశేష స్పందన

**- ప్రజలకు సేవ చేయడమే జనసేన లక్ష్యం**
**- సామల నాగేశ్వరరావు**

**తాడేపల్లి, ఏప్రిల్ 27 (జనస్వరం) :** పేద ప్రజలకు సేవ చేయడమే జనసేన పార్టీ లక్ష్యమని తాడేపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు సామల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం తాడేపల్లి మండలం, ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంప్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ మెడికల్ క్యాంప్‌ను ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్, జనసేన మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు స్ఫూర్తితో, ప్రాతూరు గ్రామ జనసేన పార్టీ, రావెళ్ల కంటి ఆసుపత్రి, సిటీ క్యాన్సర్ ఆసుపత్రి సంయుక్త సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామల నాగేశ్వరరావు, గతంలో కూడా మంగళగిరి నియోజకవర్గ పరిధిలో అనేక గ్రామాలలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించామని గుర్తు చేశారు. కంటి, గుండె, క్యాన్సర్ సమస్యలపై నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరం పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. భవిష్యత్తులో జనసేన భాగస్వామ్య కూటమి ప్రభుత్వం భాగస్వామ్యంతో మరిన్ని సేవా



సీనియర్ నాయకులు పాటిబండ్ల వెంకటేశ్వరరావు, టీడీపీ బీసీ సెల్ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి దావులూరి శ్రీనివాసరావు, తెలుగు యువత సహాయ కార్యదర్శి సంకురు నాని, జనసేన ప్రాతూరు గ్రామ అధ్యక్షుడు సంకురు విజయసాగర్, గ్రామ ఉపాధ్యక్షుడు యాదల అభిషేక్, కార్యదర్శి కళ్యాణం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. రావెళ్ల కంటి ఆసుపత్రి, సిటీ క్యాన్సర్ సెంటర్ వైద్యులు, సిబ్బంది, టిడిపి-జనసేన కార్యకర్తలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## ఏలూరులో వైసీపీ నుంచి జనసేనలోకి చేరికలు

**ఏలూరు, ఏప్రిల్ 27 (జనస్వరం) :** నియోజకవర్గంలోని 6వ డివిజన్ మాదేపల్లి రోడ్డు, ఇందిరా కాలనీ కీ చెందిన సుమారు 50 మంది కీ పైగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు దోసపర్తి రాజు ఆధ్వర్యంలో ఏలూరు జనసేన పార్టీలోకి చేరారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం చేరికల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్టీసీ జోనల్ చైర్మన్, ఏలూరు జనసేన ఇంచార్జ్ రెడ్డి అప్పల నాయుడు, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, సీనియర్ నాయకులు రాఘవయ్య చౌదరి హాజరై వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి సుమారు 50 మందికి పైగా వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు దోసపర్తి రాజు ఆధ్వర్యంలో వైసీపీని వీడి జనసేన పార్టీలోకి చేరారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా, పవన్ కళ్యాణ్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై జనసేన పార్టీలో చేరుతున్న వారిని మనస్ఫూర్తిగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. సామాన్య కార్యకర్త కూడా అత్యున్నత స్థానానికి ఎదిగే అవకాశం జనసేనలో ఉందన్నారు. ఈ సందర్భంగా ఇతర పార్టీల నుండి జనసేన పార్టీలో చేరే కార్యకర్తలు కూడా మన పార్టీ సిద్ధాంతాలను అనుసరించి ప్రజలకు చేరువవుతారు. జనసేన పార్టీ బలోపేతం కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. వైసీపీ పాలనలో ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం, అభివృద్ధి కుంటు పడటం, వైసీపీ నాయకులు చేస్తున్న అవినీతి, అక్రమాలు వల్ల పార్టీ మారాలనీ నిర్ణయించుకున్నట్లు చేరిన నాయకులు, కార్యకర్తలు తెలిపారు. ఏలూరులో రెడ్డి అప్పలనాయుడు చేస్తున్న సేవా నిష్ఠ వారిని ఆకర్షించిందని వారు స్పష్టం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో సిద్ధమవ్వాలని కార్యకర్తలకు నాయకులకు ఆయన సూచించారు. ఏలూరు నియోజకవర్గంలో ఉన్న 50 డివిజన్లోని నాయకత్వం బలపడే విధంగా పనిచేయాలని, స్థానికంగా ఉన్న సమస్యల మీదే దృష్టి సారించాలని, సమస్యలు పరిష్కారానికి పనిచేసే దిశగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే ఏలూరు పార్లమెంట్లోని ఏలూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ చాలా బలంగా ఉందని, కూటమి ఎమ్మెల్యే అయిన బడేటి రాధాకృష్ణయ్య (చంటి) జనసేన పార్టీకి సానుకూల పరిస్థితుల్లో, అవసరమైన మౌలిక సదుపాయాలు అన్నిటిని కూడా సమకూరుస్తున్నారని, ఈ సందర్భంగా జనసేన పార్టీ తరఫున ఏలూరు శాసనసభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.




## డీడీయూజీకేవై పథకం కింద నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

**- జేడీఎం సుమలత**
**- షేర్ మహమ్మద్ పేటలో విలేజ్ ఛాంపియన్స్ ఆధ్వర్యంలో గ్రామ సభ**
**- సిడాప్ ద్వారా ఉద్యోగ శిక్షణ అవకాశాలపై అవగాహన**

**జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 27 (జనస్వరం) :** గ్రామాల పరిపూర్ణ అభివృద్ధికి ఉపాధి, ఉద్యోగ కల్పన ఎంతో అవసరమని జేడీఎం (జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్) సుమలత అన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూజీకేవై) పథకం కింద 18-35 సంవత్సరాల గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు సీడాప్ సంస్థ ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ సహకారంతో కేశినేని ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొందిన విలేజ్ ఛాంపియన్స్ ఆధ్వర్యంలో, ఎన్టీఆర్ జిల్లా ఎన్ఐఆర్డీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ జి.వి.నరసింహారావు నేతృత్వంలో ఆదివారం షేర్ మహమ్మద్ పేట గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో జేడీఎం సుమలత మాట్లాడుతూ, డీడీయూజీకేవై పథకం ద్వారా నిరుద్యోగులకు 90-100 రోజుల పాటు నైపుణ్య శిక్షణ, భోజన వసతి, హాస్టల్ వసతి ఉచితంగా అందించబడుతుందని వివరించారు. ప్రత్యేకంగా బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన యువతికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జర్మన్ భాష శిక్షణ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని కోదాడ రోడ్డులోని విజ్ఞాన్ స్కూల్ వద్ద సీడాప్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను సందర్శించడంతో మరింత అవగాహన కలుగుతుందని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి ఫుడ్ ప్రాసెసింగ్ డీఆర్ఎం సురేష్ వివరించారు. ఫుడ్



ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రుణాలు, సబ్సిడీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా ఎన్ఐఆర్డీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ జి.వి.నరసింహారావు మాట్లాడుతూ, ఎంపీ కేశినేని శివనాథ్ లక్ష్యమవుతున్న "వికసిత్ పంచాయతీ" అభివృద్ధి దిశగా గ్రామాల్లో నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు ఈ గ్రామ సభ ఏర్పాటు చేయబడిందని అన్నారు. అందరూ ప్రభుత్వ శిక్షణా అవకాశాలను వినియోగించుకొని ఉపాధిని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కిల్ అప్ కోఆర్డినేటర్ రామ తులసి, వెలుగు ఏపీఎం వెంకటేశ్వరరావు, మండల సమైక్య అధ్యక్షులు గద్దె రాజలక్ష్మి, సీడాప్ జాబ్ కోఆర్డినేటర్లు అశోక్, చందు, సీడాప్ ట్రైనింగ్ సెంటర్ ఇన్-చార్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు, గ్రామ ప్రజలు, యువతీ యువకులు, పంచాయతీ ఛాంపియన్స్ పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## చిందిన ప్రతీ రక్తపు బొట్టుకి ప్రతీకార చర్య ఉంటుంది

**గుంటూరు, ఏప్రిల్ 27 (జనస్వరం) :** పహల్గాం ఉగ్రదాడిలో చిందిన ప్రతీ రక్తపు బొట్టుకి ప్రతీకార చర్య ఉంటుందని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. జమ్మూలో ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ జనసైనికుడు బద్రి నాయుడు ఆధ్వర్యంలో సంగడిగుంట మూడు బొమ్మల సెంటర్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికీ శ్రద్ధాంజలి ఘటించారు. ఆళ్ళ హరి మాట్లాడుతూ అమాయక పర్యాటకులపై జరిగిన అమానుష దాడులతో గాయపడ్డ ప్రతీ భారతీయుని హృదయానికి ప్రధాని మోదీ స్వాంతన చేకూరుస్తాడన్నారు. ఇంతటి నరమేధంలో పాల్గొన్నవారిని, వీరికి సహకరించిన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే ఉండదన్నారు. జమ్మూ కాశ్మీర్ పునర్ వైభవాన్ని చూడలేకే ఇలాంటి దాడులకు దాయాది దేశం పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్తాన్ దేశాన్ని ప్రపంచ దేశాలు దూరం పెట్టినా రాక్షసత్వాన్ని ఆ దేశం వదులుకోవటం లేదన్నారు. ఇటువంటి దాడులతో భారతదేశాన్ని అస్తిత్వ పరచాలనుకోవటం మూర్ఖత్వమన్నారు. భారతీయులంతా ఒకేమాట, ఒకే భావంతో ముందుకు




సాగుతున్నామన్నారు. ముష్కరుల వేటలో ప్రధాని మోదీ తీసుకునే ఎటువంటి చర్యలకైనా, విధానాలకైనా దేశం యావత్తు మద్దతుగా నిలుస్తుందని ఆళ్ళ హరి అన్నారు. కార్యక్రమంలో జనసేన నగర కార్యదర్శి మెహబుబ్ బాషా, డివిజన్ అధ్యక్షులు కొలసాని బాలకృష్ణ, శ్రీకాంత్, వర్కర్స్ రాష్ట్ర నేత సోమి శంకరరావు, సోమీ ఉదయ్ కుమార్, వెంకట్, సత్యనారాయణ, పవన్, అరవింద్, శివ, హరినాథ్, సుబ్బారావు, రాజు , శ్రీకాంత్, వడ్డె సుబ్బారావు, నందూరి స్వామి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## 25 వసంతల పండగ కు ముషీరాబాద్ నుంచి వెళ్లిన నగేష్ ముదిరాజ్, టిఆర్ఎస్ కార్యకర్తలు

**హైదరాబాద్, ఏప్రిల్ 28, జనస్వరం :** వరంగల్‌లో జరిగిన 25 వసంతాల పండుగకు ముషీరాబాద్ నుంచి నగేష్ ముదిరాజ్ మరియు టీఆర్ఎస్ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నగేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, "తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ, తెలంగాణ కోసం ఉద్యమించిన పార్టీ, తెలంగాణను సాధించిన పార్టీ, పదేళ్లు తెలంగాణను అభివృద్ధి చేసిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ," అని చెప్పారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణే జెండాగా, తెలంగాణే ఎజెండాగా నిలిచి గెలిచిన పార్టీ మన బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. "పల్లె పల్లెనా గుబాళించిన గులాబీ జెండాలే. ప్రతి దారి గులాబీ మయమై వరంగల్ పయనమే. తెలంగాణ అంతటా ఇంటి పండుగ సంబరాలు. కనీవినీ ఎరగని రీతిలో కదులుతున్న గులాబీ దళాలు," అన్నారు. 25 వసంతాల బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాన్ని చరిత్ర చెప్పుకునేలా విజయవంతం చేయబోతున్న తెలంగాణ ప్రజానీకానికి వందనాలు తెలిపారు.



## చిలకలమామిడిలో తాగునీటి కష్టాలు - పాలకుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆవేదన

**చింతపల్లి, ఏప్రిల్ 27 (జనస్వరం) :** చింతపల్లి పంచాయతీ పరిధిలోని చిలకలమామిడి గ్రామం తాగునీటి ఎద్దడితో అల్లాడుతోంది. గ్రామంలో నివసిస్తున్న ప్రజలు రోజూ ఊటగడ్డ వరకు సుమారు కిలోమీటర్ దూరం నడిచి తాగునీటి కోసం శ్రమించాల్సి వస్తోంది. ఈ విషయాన్ని గ్రామ మహిళలు కొర్ర పద్మ, కొర్ర శైలు వెల్లడి చేశారు. గ్రామంలో మూడు వీధులు ఉన్నప్పటికీ సరైన నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి నిర్మాణం సందర్భంగా గ్రామానికి సాగుతున్న నీటి పైపులు ధ్వంసమైపోయినప్పటికీ, అధికారులు వాటి మరమ్మత్తుకు ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కొరత నేపథ్యంలో గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమస్యను



పరిష్కరించేందుకు ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించాలని, గ్రామంలో మోటార్ బోరు ఏర్పాటు చేసి, నీటి ట్యాంకు నిర్మించి ప్రతి వీధికి తాగునీటి సౌకర్యం కల్పించి, శాశ్వత పరిష్కారం చూపాలని



మహిళలు, గ్రామస్థులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కొర్ర రాధమ్మ, గేమ్మెలి చంద్రమ్మ, కొర్ర సీతమ్మ, కొర్ర మల్లమ్మ, కించె రత్నమ్మ, సీతమ్మ గ్రామస్తులు ఆరోపించిన వారిలో ఉన్నారు.

## సామాజిక సేవలకు గుర్తింపు... కందుకూరి వీరేశలింగం అవార్డు

**నంద్యాల, ఏప్రిల్ 27, జనస్వరం :** గత 20 సంవత్సరాలుగా పట్టణంలో వికలాంగులకు సామాజిక సేవలలో విశిష్ట సేవలందించినందుకు గుర్తింపుగా, నంద్యాల వాసి డాక్టర్ గుర్రాల రవి కృష్ణకు కందుకూరి వీరేశలింగం అవార్డు రావడం ఆనందదాయకమని వక్తలు పేర్కొన్నారు. సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం 177వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో నిర్వహించిన తెలుగు నాటకరంగ దినోత్సవంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్రస్థాయి కందుకూరి ప్రతిష్ఠాత్మక రంగస్థల అవార్డు, లక్ష రూపాయల నగదు పురస్కారం, ప్రశంసాపత్రం డాక్టర్ రవి కృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా ఐఎంఏ నంద్యాల తరఫున పలువురు వైద్యులు ఆయనను శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఆదరించి సత్కరించి అభినందించారు. సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డాక్టర్ సహదేవుడు, ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ, డాక్టర్ రవి కృష్ణ దర్శకత్వంలో కళారాధన సంస్థ ద్వారా సామాజిక చైతన్యం కలిగించే సాంఘిక నాటకాలు, పద్య పౌరాణిక నాటకాలు, బాలలలో సామాజిక స్పృహ పెంపొందించేందుకు బాలనాటికలు రూపొందించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాల్లో, రాష్ట్ర-రాష్ట్రేతర ప్రాంతాల్లో వందలాది ప్రదర్శనలు నిర్వహించి నంద్యాల కళా వైభవాన్ని రాష్ట్ర, దేశ వ్యాప్తంగా చాటి చెప్పారని తెలిపారు. నంద్యాలకు దాదాపు 20 నంది బహుమతులు తీసుకువచ్చారని చెప్పారు. 2017లో ఉగాది పురస్కారం, 2018లో కళారత్న హంస పురస్కారాలు అందుకున్న డాక్టర్ రవి కృష్ణకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కందుకూరి రంగస్థల రాష్ట్రస్థాయి పురస్కారం అందించడం నంద్యాలకు గర్వకారణమని పేర్కొన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ, కళారాధన సంస్థ 2000 సంవత్సరంలో ప్రారంభమైందని, ప్రస్తుతం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని, రజతోత్సవ వేడుకలను సంవత్సరం పొడవునా నిర్వహించనున్నట్లు తెలిపారు. కళారాధన కార్యక్రమాలకు గత 25 సంవత్సరాలుగా



నంద్యాల వైద్యులు అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ వసుధారాణి, డాక్టర్ పనిల్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ బచ్చు సత్యనారాయణ, డాక్టర్ ఓబులరెడ్డి, డాక్టర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## 28న (నేడు) కోకో రైతుల చలో గుంటూరు "ధర్నా"

* **అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కల్పించాలి..**
* **కంపెనీ మోసాలు అరికట్టి కోకో రైతులకు న్యాయం చేయాలి.**
* **ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు డిమాండ్.**

**పెదవేగి (విజయరాయి), ఏప్రిల్ 27 (జనస్వరం) :** అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కల్పించాలని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కోకో గింజల ధరల ఒప్పంద నిర్ణయం ప్రకటించాలని కోరుతూ ఈనెల 28న (నేడు) కోకో రైతుల చలో గుంటూరు "ధర్నా" కార్యక్రమాన్ని చేపట్టామని, కోకో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ కోరారు. ఆదివారం విజయరాయి, గాంధీనగర్‌లోని కోకో తోటలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈనెల 28న ఉదయం 10 గంటలకు గుంటూరు చుట్టుగుంటలోని ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ముందు జరిగే కోకో రైతుల ధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో సుమారు 75 వేల ఎకరాల్లో కొబ్బరి, ఆయిల్ పామ్ అంతర పంటగా కోకో సాగు చేస్తున్నరైతులు ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు అంతర్జాతీయ మార్కెట్ ధరకు అదనంగా ధర ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేసిన కంపెనీలు ప్రస్తుతం సిండికేట్‌గా మారి, కోకో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో కిలో కోకో గింజలకు రూ.750/- పైగా ధర ఉన్నప్పటికీ, ప్రస్తుతం కంపెనీలు కేవలం రూ.450 నుండి రూ.500 వరకు మాత్రమే ఇవ్వడమే కాకుండా, కొన్నిచోట్ల ట్రేడర్లు ఇంకా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు.



కోకో గింజలు కొనుగోలు సమస్యలపై ఈనెల 3న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, సచివాలయంలో ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు, కోకో రైతులు, కోకో గింజల కొనుగోలు కంపెనీలతో సమావేశం నిర్వహించిన విషయం గుర్తు చేశారు. ఆ సమావేశ నిర్ణయం ప్రకారం ఈనెల 7న ధరల ఒప్పంద ప్రకటన చేయాల్సి ఉండగా, ఇంతవరకు ప్రకటన లేకపోవడం వల్ల కంపెనీలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని, ఫలితంగా రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలకు తగిన ధర కల్పించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కోకో రైతుల చలో గుంటూరు "ధర్నా" కార్యక్రమంలో రైతులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి అచ్యుతరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుడిబండి వీరారెడ్డి, కొసరాజు రాధాకృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కోనేరు సతీష్ బాబు, నాయకులు నాగరాజు శ్రీనివాసరాజు, కె. రామిరెడ్డి, పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఐపీఈ వార్షిక ఫైనాన్స్ కాన్ఫరెన్స్ 2025 కు ఆహ్వానం

**హైదరాబాదు, ఏప్రిల్ 27, జనస్వరం :** పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ ఇన్‌స్టిట్యూట్ (IPE), హైదరాబాద్ దాని షామీర్పేట్ క్యాంపస్‌లో ఏప్రిల్ 28–29, 2025 తేదీలలో హైబ్రిడ్ మోడల్‌లో వార్షిక ఫైనాన్స్ కాన్ఫరెన్స్ 2025 నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ అకాడెమిసియన్‌లు, పరిశోధకులు మరియు ఇండస్ట్రీ నిపుణులు ప్రధాన ఆర్థిక పోకడలను చర్చించడానికి ఒకచోట కలుస్తారు. ఐఐఎమ్లు, ఐఐటీలు మరియు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి 200కి పైగా పరిశోధన పత్రాలు సమర్పించబడ్డాయి. ఎంపికైన పత్రాలు ఆరు సాంకేతిక సెషన్లలో ప్రదర్శించబడతాయి. ఈ సెషన్లు కార్పొరేట్ ఫైనాన్స్, ఫైనాన్షియల్ మార్కెట్లు, ఫిన్‌టెక్ మరియు బ్యాంకింగ్ ఆవిష్కరణలు, బిహేవియరల్ ఫైనాన్స్, కార్పొరేట్ గవర్నెన్స్, సస్టైనబిలిటీ & రెస్పాన్సిబుల్ ఫైనాన్స్ మరియు ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ & లిటరసీ వంటి అంశాలను కవర్ చేస్తాయి. ఈ కాన్ఫరెన్స్‌లో ప్రముఖ నిపుణులు మరియు ఆలోచనా నాయకులు డైనమిక్ ప్యానెల్ చర్చలు మరియు జ్ఞాన-భాగస్వామ్య సెషన్లలో పాల్గొంటారు. ప్రొఫెసర్ ఎన్.ఆర్. పారసురామన్ (ఫైనాన్స్ ప్రొఫెసర్ మరియు ఎస్డీఎంఐఎండి మాజీ డైరెక్టర్) చీఫ్ గెస్ట్‌గా ఉద్ఘాటనా ఉపన్యాసం ఇస్తారు. ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి (ఐసిఎస్ఎస్ఆర్-ఎస్ఆర్సీ, హైదరాబాద్ హోనరరీ డైరెక్టర్) గెస్ట్ ఆఫ్ హనర్‌గా పాల్గొంటారు. రిజిస్ట్రేషన్ మరియు ఇతర వివరాలకు: డాక్టర్ పి. కళ్యాణిని (9885463506) సంప్రదించండి.

## నేటి నుంచి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు



**పెదపాడు, ఏప్రిల్ 27 (జనస్వరం) :** పెదపాడు శాఖా గ్రంథాలయం నందు ఏప్రిల్ ది:28/04/2025 సోమవారం నుండి జూన్ నెల ది:06/06/2025 శుక్రవారం వరకు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమములు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహణ జరుగునని ఈ శిబిరంలో విద్యార్థిని విద్యార్థులకు బాలసాహిత్యం ,కథలు వినడం, కథలు చెప్పడం, కథలు చదివించడం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం, చదరంగం, క్యారమ్స్, క్విజ్, జీకే మొదలగు అంశాలను బాలలు నేర్చుకోవచ్చును అని తెలియజేశారు. తల్లిదండ్రులు మీ పిల్లలను తప్పనిసరిగా గ్రంథాలయమునకు పంపించి మంచి విజ్ఞానవంతులుగా తయారు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ పండగకు జననీరాజనం

**- ఎల్కతుర్తి సభ విజయవంతం**
**- శేరిలింగంపల్లి నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భారాస కార్యకర్తలు**
**- గులాబీ పండుగను సక్సెస్ చేసిన ప్రజానీకం**
**- హర్షం వ్యక్తం చేసిన భారాస సీనియర్ నేత రవీందర్ యాదవ్**
**- రజతోత్సవ సభను విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు**



**శేరిలింగంపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 27, (జనస్వరం) :** భారాస నిర్వహించిన రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున శేరిలింగంపల్లి నుంచి తరలి వచ్చిన కార్యకర్తలు, ప్రజలకు బీఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆవిర్భావం 25 ఏళ్ల పండుగకు సైన్యంలా కదిలారని అన్నారు. పార్టీ జెండా ఆవిష్కరించి శేరిలింగంపల్లిలోని అన్ని డివిజన్ ల నుంచి భారీ సంఖ్యలో బయలు దేరి తెలంగాణ సత్తా చాటారని కొనియాడారు. ఎన్ని ఇబ్బందులు పడినా సభా స్థలికి చేరుకొని పోరాట స్ఫూర్తిని చూపించారని స్పష్టం చేశారు. తెలంగాణ ఇంటి పార్టీ సంబురం అంగరంగ వైభవంగా జరిగిందన్నారు. కేసీఆర్ చూపిన బాటలో మరోసారి నడుస్తామని రవీందర్ యాదవ్ అన్నారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా భారాస విజయం సాధిస్తుందని వరంగల్ సభ నిరూపించిందన్నారు. ఎల్కతుర్తిలో జరిగిన సభ చరిత్రలో నిలిచిపోతుందని స్పష్టం చేశారు. తెలంగాణకు నష్టం జరిగితే చూస్తూ ఊరుకోబోమని సభ చాటి చెప్పిందని వెల్లడించారు. శేరిలింగంపల్లిలోనూ తెలంగాణ ఇంటి పార్టీ సత్తా మరోసారి స్పష్టమైందని రవీందర్ యాదవ్ అన్నారు. కేసీఆర్ మార్గంలో, కేటీఆర్ డైరెక్షన్ లో నడుస్తూ శేరిలింగంపల్లిలో ప్రజా సమస్యలపై భారాస అలుపెరగని పోరాటం చేస్తామని రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు.

## దివ్యాంగులకు వేల్పులరాము దుస్తులు వితరణ

**పులివెందుల, జనస్వరం :** ప్రజానాయకుడిగా, సౌమ్యుడిగా, సహృదయుడిగా, ముఖ్యంగా ప్రజానాడి తెలిసిన వైద్యుడిగా, యువసేవాతత్పరుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, నియోజకవర్గ ప్రజలందరి ఆదరాభిమానాలు చూరగొన్న అభిషేక్ రెడ్డి ఎంతో భవిష్యత్తు ఉన్న నాయకుడిగా ఎదుగుతున్న తరుణంలో, దురదృష్టవశాత్తు, ఆవిధి అయనను మననుండి దూరంచేసినప్పటికీ, ఆయన జ్ఞాపకాలు, మధుర స్మృతులు, ఆయన చేపట్టిన ప్రజాసేవా కార్యక్రమాలు మన హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, జననాయకునికి మరణం లేదని, పులివెందుల ప్రజాబాహుల్యంలో ఆయనపేరు చిరంజీవిగా చిరకాలం నిలిచిపోతుందని, ఆయన 37వజన్మదినం వేల్పుల గ్రామంలో నిర్వహించడం, వేముల మండల వ్యాప్తంగా దివ్యాంగులకు సేవాకార్యక్రమాలు చేపట్టడం తమఅదృష్టంగా భావిస్తున్నామని, ఆయన కుటుంబ సభ్యులు ప్రజాశీస్సులతో ఆయురారోగ్యాలతో విలసిల్లాలని ప్రముఖ వైఎస్ఆర్సిపి నాయకులు వేల్పులరాము, మాజీగ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగాల ఉషారాణి పేర్కొన్నారు. దివంగత వైఎస్ఆర్సిపి నేత వైయస్ అభిషేక్ రెడ్డి 37వ జయంతిని పురస్కరించుకుని లింగాల రామలింగారెడ్డి ఆధ్వర్యంలో వేల్పుల చర్చి ఆవరణంలో ఏర్పాటు చేసిన ఒకకార్యక్రమంలో



ఆయన సతీమణి డాక్టర్ సౌఖ్యరెడ్డి, వారి పిల్లలు ఆకర్ష, అక్షర, అభిషేక్ సోదరుడు వైయస్ అభినయ్ రెడ్డి తదితరులు ఆయన చిత్రపటానికి పుష్పనీరాజనాలర్పించి, ఆయన పవిత్రఆత్మకు శాంతిచేకూరాలని రెండునిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం వేముల మండలంలోని వందమంది అవయవాలులేని వికలాంగులకు వేల్పులరాము సమకూర్చిన దుస్తులను అభిషేక్ కుటుంబ సభ్యులచేతుల మీదుగా పంపిణీచేశారు. తదనంతరం దివ్యాంగులకు, కార్యకర్తలకు, గ్రామప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీమార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సునీల్, వైయస్సార్సీపి దివ్యాంగుల విభాగం నియోజకవర్గ అధ్యక్షులు చాగలేటి భాస్కర్, ఎంపీటీసీ బాబ్ జాన్, నాయకులు ధనుంజయ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి టిప్పర్లకు వెసులుబాటు కల్పించిన కైకలూరు ఎమ్మెల్యే

**కైకలూరు ఏప్రిల్ 27 (జనస్వరం) :** జాతీయ రహదారి విస్తరణ పనులకు మట్టి టిప్పర్లు తిరగవచ్చని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదివారం స్థానిక ట్రావెలర్స్ బంగ్లా నందు మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెసులుబాటు కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో మట్టి టిప్పర్ల వలన రహదారులు ధ్వంసం అవుతున్నాయని కైకలూరు నియోజకవర్గంలో మట్టి టిప్పర్లు కనబడితే సీజ్ చేయాలని రెవిన్యూ పోలీసు వర్గాలకు తాను ఆదేశించిన విషయం అందరికీ తెలిసిందేనని దానివలన హైవే పనులు కష్టతరం అవుతుందని కాంట్రాక్టర్లు చేతులెత్తేయడంతో మండవల్లి మండలం బైరవపట్నం నుండి కైకలూరు మండలం పల్లెవాడ శివారు వరకు మట్టి టిప్పర్లకు వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. రహదారి పనులు ఈ ఏడాదిలోపు పూర్తి చేస్తామని, ఈలోపు సుమారు 10 వేల టిప్పర్లు మట్టి అవసరమని, ట్రాక్టర్లతో అయితే 55 వేల ట్రిప్పులు మట్టి తరలింపు కష్టతరం అవుతుందని అందుకు తాను ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని కావున అందరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. జాతి రహదారి పనులు కైకలూరు, మండవల్లి మండలాల్లో మాత్రమే జరుగుతున్నాయని, మిగిలిన మండలాల్లో ఎక్కడా టిప్పర్లు తిరగడానికి అనుమతి లేదని చెప్పారు. ఇదే అదునుగా తీసుకుని ఎవరైనా మట్టి టిప్పర్లు రవాణా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కూటమి నేతలు కొల్లి వరప్రసాద్ (బాబి), పెనుమత్స త్రినాధ్ రాజు, పూల రాజీ, తాడినాడ బాబు తదితరులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వం రాకతో మత్స్యకారులకు మహర్దశ

**కైకలూరు ఏప్రిల్ 27 (జనస్వరం) :** కూటమి ప్రభుత్వం రాకతో మత్స్యకారుల కుటుంబాల్లో మహర్దశ ఏర్పడిందని కైకలూరు నియోజకవర్గం టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా మత్స్యకారుల జీవనశైలి పరిశీలించి వేట నిషేధ సమయంలో రూ 20 వేల సాయం విడుదల చేయడం ద్వారా రాష్ట్రంలోని 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరిందని వీరమల్లు నరసింహారావు పేర్కొన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో ఆర్థికసాయం రెట్టింపు చేసి.. విడుదల చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ 300 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. ఒక్క మత్స్యకారుని కుటుంబమైనా బాగుపడిందా అని ప్రశ్నించారు.2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టిందని పేర్కొన్నారు.రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయని, చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రం ముందువరుసలో ఉందన్నారు.




## గీతా మందిరంలో భాగవత ప్రవచనం



**పులివెందుల ఏప్రిల్ 27 (జనస్వరం) :** కడప జిల్లా పులివెందుల పట్టణంలోని గీతా మందిరంలో వేముల మండలం వి కొత్తపల్లి గ్రామ సర్పంచ్ కొప్పాల గంగరాజు ఆదివారం భాగవత ప్రవచనం చేశారు. కాళీయ మర్దన మహత్తర ఘట్టం గురించి వ్యాఖ్యానం చేశారు. కాలింది మడుగు నుండి కాళీయుడు అనే విష సర్పాన్ని వెడలగొట్టి.. కాలింది జలాలను శుద్ధి చేసి సర్వజీవులకు అందించినట్లు చెప్పారు. భాగవత భక్తులు, కార్యనివాహకులు పాల్గొన్నారు.

## వివేకా హత్య కేసులో సాక్షుల మరణాలపై విచారణ వేగవంతం



**పులివెందుల ఏప్రిల్ 27, (జనస్వరం) :** మాజీ మంత్రి వివేకా హత్య కేసులో సాక్షులుగా ఉన్న వారు ఒక్కొక్కరుగా మృతి చెందడంపై సిట్ విచారణ చేపట్టింది. ఆ మేరకుసిట్ బృందం విచారణ వేగవంతం చేసింది. ఈకేసులో మొత్తం ఆరుగురు సాక్షులు మృతి చెందారు. వివేకా ఇంటి వాచ్మెన్ రంగన్న మృతితో ఈకేసును ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. సాక్షుల మరణాలపై కొంతకాలంగా పులివెందులలో సిట్ అధికారులు విచారిస్తున్నారు. తాజాగా ఆదివారం పులివెందుల పట్టణంలో నివాసముంటున్న కె.శ్రీనివాసరెడ్డి బామ్మర్ది కసునూరు పరమేశ్వర్రెడ్డి ఇంటికి వెళ్లి విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. ఈ కేసును మరింత వేగవంతం చేయనున్నట్లు తెలిసింది.


## షటిల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రధానం



**పులివెందుల ఏప్రిల్ 27 (జనస్వరం) :** వేసవి సెలవుల నేపథ్యంలో వేంపల్లి పట్టణంలో ఆదివారం నాగశెట్టి సునీల్ ఆధ్వర్యంలో తాలూకా స్థాయి షటిల్ టోర్నమెంట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక పట్టణ సమీపంలోని వైయస్సార్ ఇండోర్ స్టేడియంలో ఈ షటిల్ టోర్నమెంట్ జరిగింది. తాలూకా స్థాయి నుంచి 20 జట్లు పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతి ని పులివెందుల నాయక్ టీం, రెండో బహుమతి వేంపల్లి మణి టీం, మూడో బహుమతి మారుతి టీం గెలుచుకున్నారు. గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు బహుమతులను ప్రధానం చేశారు.


## రాచపల్లి గుబ్బాలమ్మ తల్లి జాతరలో పాల్గొన్న మురళిరాజు

**ప్రత్తిపాడు, ఏప్రిల్ 27( జనస్వరం) :** ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో గుబ్బాలమ్మ తల్లి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నియోజకవర్గ వైసిపి నేత,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కృష్ణంరాజు జాతరలో పాల్గొన్నారు. గుబ్బాలమ్మ అమ్మవారిని ఆలయ కమిటీ సభ్యులతో దర్శించుకున్నారు. జాతర నిమిత్తం కమిటీ సభ్యులకు 5000 రూపాయలు విరాళాలు అందజేసారు. గ్రంధ అమావాస్య సందర్భంగా గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేయడం చాలా సంతోషదాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి నాని, నారిరెడ్డి వీరబాబు, సారిపల్లి గోవింద్,కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, గుమ్మిడి రామకృష్ణ, కోలా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు..



## 22 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**ప్రత్తిపాడు, ఏప్రిల్ 27( జనస్వరం) :** చదువులమ్మ చెట్టు నీడలో చెట్టాపట్టాలేసుకుని కలసితిరిగిన ఆ స్నేహితులు ఆదివారం ఉల్లాసంగా, ఉత్సహంగా గడిపారు. స్నేహితులంతా ఒకటై స్నేహబంధాన్ని మరింతగా బలపర్చుకొన్నారు. మండలంలోని ధర్మవరం హైస్కూల్ ఆవరణలో శ్రీ అద్దేపల్లి అచ్యుతరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులంతా 22 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో అలనాటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని హై స్కూల్ ఆవరణలో ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సహంగా గడిపారు. వివిధ వృత్తుల్లో, ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడి వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా ప్రస్తుత బిజీ షెడ్యూల్లో కూడా స్నేహ బంధమే ముఖ్యమంటూ ఒకచోట కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థులంతా తమ వయసుని సైతం పక్కనపెట్టి వినోద కార్యక్రమాలు పాల్గొని గీతాలాపన చేస్తూ పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ముందుగా పరిచయం కార్యక్రమం నిర్వహించారు. అలాగే గ్రూప్ ఫోటో దిగి తమ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. మరొకసారి కలుద్దాం అంటూ ఒకరిని ఒకరు ఆత్మీయ వీడ్కోలు చెప్పుకున్నారు. ఈ ఆత్మీయ కలయిక కు కృషి చేసిన స్నేహితులును తోటి విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు ప్రస్తుతం గొల్లప్రోలు ఎంఈఓ శివప్రసాద్, గొల్లప్రోలు చిన్నారావు, కిర్లంపూడి అప్పటి ఉపాధ్యాయులు పర్వత వెంకట్రావు, వాణి, సుబ్బారావు, రంగనాయకులు, నాగవేణి, పి ఈ టి ఉపాధ్యాయులు శ్రీను లను ఘనంగా సన్మానించారు



## ఘనంగా లిటిల్ ఫ్లవర్ స్కూల్ 35వ వార్షికోత్సవం

**- బొర్రా చలమయ్య సేవలు భావితరాలకు ఆదర్శం**
**- ప్రశంసించిన ఎమ్మెల్యే డాక్టర్ కామినేని**

**ముదినేపల్లి, ఏప్రిల్ 27, (జనస్వరం) :** మండలంలోని గురజ గ్రామంలో ఉన్నటువంటి లిటిల్ ఫ్లవర్ స్కూల్ 35వ వార్షికోత్సవం పాఠశాల ప్రిన్సిపల్ బొర్రా చలమయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్, కైకలూరు శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లిటిల్ ఫ్లవర్ స్కూల్ పాఠశాలను 3 దశబ్దాల కాలంగా నిరంతరాయంగా నిర్వహిస్తున్న చలమయ్యకి, పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఒక విద్యా వేత్త, ఒక ఆర్థికవేత్త అలానే ఒక రాజకీయ వేత్త అయనటువంటి బొర్రా చలమయ్య సేవలు భావి తరాలకు ఆదర్శనీయమన్నారు. అలాంటి వ్యక్తి పాఠశాల నడపటం అంటే పిల్లల భవిష్యత్తుకు డోకా లేనట్టే అని భరోసా కల్పించారు.అలాంటి క్రమశిక్షణ పరుడు మన చలమయ్యని వారి సేవలను కొనియాడారు. ఇటీవల 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, తాడినాడ బాబు,ప్రజాప్రతినిధులు, పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.









## గజరాజుల నుండి పంట పొలాలను కాపాడాలి : డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

**పులివెందుల ఏప్రిల్ 27 (జనస్వరం):** గత కొంత కాలంగా రాష్ట్రం లో ఏనుగుల భీభత్సం ఎక్కువైందని ,వీటి బారినుండి ప్రజలను,పంట పొలాలను కాపాడాలని రాజ్య సభ మాజీ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేంపల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడవుల్లో ఆహారం,నీటి కొరత కారణంగా,వివిధ ఏనుగుల గుంపుల మధ్య పోరాటం కారణంగా అడవుల నుండి ఏనుగులు సమీపం లోని గ్రామాల్లోకి రావడం, పంటలు ధ్వంసం చేయడం,కనిపించిన మనుష్యులను తొండంతో విసిరి వేసి చంపడం,లేదా కాళ్ళతో తొక్కి చంపడం చేస్తున్నాయన్నారు. 18-1-2025 న తిరుపతి జిల్లా,చంద్రగిరి మండలం,కందుల వారి పల్లి ఉప సర్పంచ్ ,టీడీపీ మండల నాయకుడు రమేష్ చౌదరిని ఏనుగులు కాళ్ళతో తొక్కి చంపాయన్నారు. 25-4-2025 న తిరుపతి జిల్లా చిన్న గొట్టి గల్లు మండలం ,చిత్తే చర్ల పంచాయితీకి చెందిన 65 యేండ్ల రైతు సిద్ధయ్య మిరప పంటకు నీరు కట్టి వస్తుండగా ఆయనను తొక్కి చంపాయి. ఉమ్మడి చిత్తూర్ జిల్లాలోని కుప్పం, పలమనేరు, పుంగనూరు, చంద్రగిరి నియోజకవర్గాలలో విజయనగరం జిల్లాలో,రాష్ట్రం లోని అనేక ప్రాంతాలలో ఏనుగుల దాడులు తరచుగా జరుగుచున్నాయని తెలిపారు. 2011 నుండి నేటివరకు ఒక్క ఉమ్మడి చిత్తూర్ జిల్లా లోనే ఏనుగుల దాడిలో 23 మంది చనిపోయారు.అనేక మంది గాయపడ్డారు.233 ఎకరాలలో పంట నాశనమయిందన్నారు. దాదాపు పహల్గాం మృతుల సంఖ్య తో సమానంగా ఏనుగుల దాడిలో మృతుల సంఖ్య వుండడం శోచనీయం. ప్రజలకు కంటి మీద కునుకు లేదు. కర్నాటక రాష్ట్రం నుండి ఈ సమస్య పరిష్కారం కోసం ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ తెచ్చిన కుంకీ ఏనుగులు ఏమయ్యాయో తెలియకుండా వుందన్నారు. ముఖ్య మంత్రి గారు పదేపదే స్వర్ణాంధ్ర,సంతోష ,ఆరోగ్య,సంపద ఆంధ్ర అంటూ డైలాగులు చెబుతున్నారు.అవి దేవుడెరుగు.ముందు సొంత జిల్లాలో,సొంత నియోజకవర్గం కుప్పం లో ఏనుగుల బెడద నుండి ప్రజలను, పంట పొలాలను కాపాడాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**అరటి రైతులను ఆదుకోవాలి :**

రాష్ట్రం లో 1,44,987 ఎకరాలలో రైతులు అరటి పంట వేశారు. ముఖ్యంగా కడప, అనంతపురం,నంద్యాల,తూర్పు గోదావరి, కోనసీమ, పార్వతీపురం తదితర జిల్లాలలో అరటి పంట వేశారని తులసి రెడ్డి తెలిపారు. ఎకరాకు దాదాపు రు 2 లక్షలు పెట్టుబడి అవుతుందని ఎకరాకు 20 టన్నులు దిగుబడి వస్తుంది. టన్నుకు రు 10 వేలు ధర పలికితే అసలు వస్తుందన్నారు. కానీ సింగపూర్, మలేషియా, ఇండోనేషియా తదితర దేశాలకు ఎగుమతి నిలిచిపోయిన కారణంగా ధర అమాంతం పడిపోయింది. టన్నుకు రు5 వేలకు కూడా కొనడం లేదు. రైతులకు ఎకరాకు లక్షా రూపాయలు నష్టం వస్తోంది. ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని తులసి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



**గోకులం బిల్లులు చెల్లించాలి :**

రైతులు 10శాతం,ప్రభుత్వం 90శాతం భరించే విధంగా గోకులం,మినీ గోకులం షెడ్లు,రైతులు 30శాతం,ప్రభుత్వం 70 శాతం భరించే విధంగా గొర్రెల షెడ్లు ప్రభుత్వం మంజూరు చేసింది. రైతులు అధిక వడ్డీకి అప్పు తెచ్చి నిర్మించుకున్నారు. కానీ 4నెలల నుంచీ ప్రభుత్వ సబ్సిడీ సొమ్ములు విడుదల కాలేదు. వడ్డీలు పెరిగిపోతున్నాయి. రు 150 కోట్ల బకాయిలు వున్నాయి. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలు 150 కోట్ల రూపాయలు విడుదల చేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

## ఎన్డీఏ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలి

**పులివెందుల ఏప్రిల్ 27 (జనస్వరం) :** కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మికులను బానిసలను చేసే నల్ల చట్టాలను చేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులందరూ ఉద్యమించాలని, మే 1వ తేదీన జరగబోయే 139వ మేడే కార్యక్రమంలో కార్మికులందరూ భాగస్వామిలై మన ఐక్యతను పాలక పక్షాలకు తెలిసేలా కదలి రావాలని ఏపీ భవనిర్మాణ కార్మిక సంఘం ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు బళ్లారపు రామాంజనేయులు పిలుపునిచ్చారు. వేంపల్లి లో ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి కూటమి అయిన ఎన్ డి ఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్లకు అనుకూలమైన నల్ల చట్టాలను రూపొందించి కార్పొరేట్ల కార్ఖానాలలో కార్మికులను బానిసలుగా చేసే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తోందన్నారు, ఇప్పటికే అనేక సంవత్సరాలుగా కార్మికులు పోరాడి ప్రాణాలు అర్పించి సాధించుకున్న అనేక చట్టాలను నాలుగు చట్టాలుగా కుదించినదని ఈ చట్టాల కారణంగా కార్మికుల పని గంటలు పెరిగిందన్నారు. ఇంతవరకు సాధించుకున్న ఎనిమిది గంటల పని, కనీస వేతన చట్టాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఈ నిరంకుశ ప్రభుత్వ విధానాలను ప్రతి ఒక్క ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుడు వ్యతిరేకించాలని మే 1వ తేదీన జరగబోవు మేడే కార్యక్రమంలో సంఘటిత, అసంఘటిత కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని మన ఐక్యతను ప్రభుత్వాలకు తెలిసేలా జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చర్ల బాలాజీ ఎస్ దసగిరి బుజ్జి బాబు పెయింటర్ బాబు. కిట్టయ్య ఆదినారాయణ. బాబా, మాధవరెడ్డి, రవి .రామయ్యలు పాల్గొన్నారు.




## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**పాలకొల్లు, ఏప్రియల్ 27 (జనస్వరం) :** రాష్ట్రంలో రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు అన్నారు. మన రైతు మన రామానాయుడు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాలకొల్లు మండలం చందపర్రు, ఆగర్తిపాలెం, వెలివెల గ్రామాల్లో రూ.1కోటి యాభై ఆరు లక్షలతో పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో మంత్రి రామానాయుడుకు రైతులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి దీవించారు. రూ.11లక్షలతో చందపర్రు గ్రామ బస్ స్టాప్ దగ్గరలో రెవెన్యూ డ్రైన్ పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు, మరో రూ.16 లక్షలతో ఆగర్తి పాలెం గ్రామంలో మల్లవరం బ్రాంచి చానెల్ పై ఆగర్తి పాలెం నుండి వెలివెల వెళ్ళే దారిలో గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు, రూ.28.50 లక్షలతో వెలివెల గ్రామంలో జిన్నూరు చానెల్ పై వెలివెల బ్రిడ్జ్ దగ్గరలో గ్రావెల్ రహదారి ర్మాణ పనులకు, 9.67 లక్షలతో వెలివెల బ్రిడ్జ్ దగ్గరలో జిన్నూరు చానెల్ త్రవ్వ పనులకు, రూ.31 లక్షలతో జిన్నూరు చానెల్ పై పైలోడు పుంత దగ్గరలో గ్రావెల్ రహదారి ర్మాణ పనులకు, రూ.59 లక్షలతో జిన్నూరు చానెల్ కడలి వారి పాలెం వద్ద, వంతెన పనులకు మంత్రి రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం రైతు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. జగన్ గత ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్ వ్యవస్థను వ్యవసాయాన్ని గాలికి వదిలేసారని విమర్శించారు. నేడు చంద్రబాబు ఆ రెండు రంగాలను గాడిలో పెట్టి రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. రైతు ప్రభుత్వాన్ని రైతాంగమంతా పెద్ద ఎత్తున ఆశీర్వదించాలని మంత్రి రామానాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సి చైర్మన్ కోడి విజయభాస్కర్, సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు, సర్పంచ్ కావలి లక్ష్మీ కుమారి, డి.సి అధ్యక్షులు పెనుమత్స రామబద్ర రాజు, ఎంపీటీసీ గెద్దాడ కుటుంబరావు, రాపాక విజయరత్నం, నక్క సామ్యూల్ రాజు, బత్తుల భాస్కరరావు, వేగేశ్న శ్రీహరి రాజు, పంచగళ్ళ సైమన్, కలిదిండి శ్రీనివాసరాజు, పుచ్చకాయల సైమన్, శ్రీ రెడ్డి బాబులు, ఉంగరాల నరసింహారావు, గిడుగు కిరణ్, మేడిది జాన్ రాజ్, ఆ బిల్ రాజు, నున్న బో యిన సత్యనారాయణ, కంది నాగేశ్వరరావు కోటి రాంబాబు, దొమ్మేటి ఏసుదాసు, కందిబోయిన నాగరాజు, బో డబాటి నారాయణరావు, కొప్పినీడి శ్రీనివాసు, పెద్దింటి శ్రీను, డాక్టర్ శివ, రాయి ప్రసాద్, ఇంటి శ్రీరాముడు కుక్కల సత్యనారాయణ, అందే కోటి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



## రియల్ ప్రజా పొలిటిషియన్ ను చూద్దాం రండి..! శ్రమదానం చేసిన మంత్రి రామానాయుడు

**పాలకొల్లు, ఏప్రియల్ 27 (జనస్వరం) :** నేను రాష్ట్ర మంత్రినే.. కాదనడం లేదు. కానీ.. అంతకంటే ముందు సగటు మనిషిని..! నేను నా ఉనికిని ఎన్నటికీ కోల్పోను. గతాన్ని మర్చిపోను. అందుకే ప్రజల మధ్యన ఉండడానికి వారితో కలిసి పని చేయడానికి, వారి సమస్యలు పరిష్కరించడానికి ఎక్కువ ఇష్టపడుతుంటాను అని చెప్పారు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. ఊహకందని విధంగా ఆదివారం పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం పై నిర్మిస్తున్న, స్లాబ్ నిర్మాణ పనుల్లో రెట్టించిన ఉత్సాహంతో శ్రమదానం చేశారు మంత్రి రామానాయుడు. ఇది చూసిన ప్రజలు ఔరా..! అని ముక్కుపై వేలు వేసుకున్నారు. మంత్రి నిమ్మల పేదల కష్టం తెలిసిన ప్రజల మనిషి అని, అందుకే ఇలా.. నేను రాష్ట్ర మంత్రిని అనే అహం విడిచి శ్రమదానం చేయగలిగారని కొనియాడారు. ప్రజల మనసు గెలిచిన, అసలు సిసలైన ప్రజా పొలిటిషియన్ అంటే ఇలానే ఉండాలి కదా..!? ఈ శ్రమదానంలో ముఖ్య టిడిపి నాయకులు పాల్గొన్నారు





Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690, Mahendra (Sub editor) - 9866140211
REGD NO :APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.

# కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మత్స్యకారులకు మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు
## - ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

**దెందులూరు, ఏప్రిల్ 27 (జనస్వరం)** : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అనునిత్యం కష్టపడి జీవించే మత్స్యకారుల జీవితాల్లో సంక్షేమం సాకారం అవుతుందని, దేశ మత్స్య సంపదలో 29% మన రాష్ట్రానిదే అని, రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మత్స్యకారులకు అండగా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తామని" దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్య కారుల కోసం మత్స్య కారుల సేవలో పథకం ద్వారా వేట నిషేధ సమయంలో రూ. 20,000 సాయం విడుదల చేయటం ద్వారా రాష్ట్రంలోని 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. అదే విధంగా ఇటు కొల్లేరు తో పాటు రాష్ట్రంలోని మత్స్యకార గ్రామాలు టీడీపీకి అండగా నిలబడ్డాయి అని, సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించి మత్స్య కారుల సేవలో పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించటం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు..ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10,000 నుంచి రూ.20,000కు పెంచామని, ప్రజలందరికీ సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని ఆయన తెలిపారు. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ. 300 కోట్లు ఖర్చు పెట్టామన్నారు, ఒక్క మత్స్యకారుని కుటుంబమైనా బాగుపడిందా? అని ప్రశ్నించారు. 2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టింది అని గుర్తు చేశారు. 2014-2019 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.788 కోట్లు ఖర్చు పెట్టాము అని, అంతేకాకుండా వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా ఇచ్చామనీ, రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నెలనెలా పింఛన్లు అందిస్తున్నామనీ తెలిపారు. మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నామని, వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నాం అని ఎమ్మెల్యే చింతమనేని తెలిపారు.



**చేపల ఎగుమతుల్లో ఏపీ టాప్** : రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయి అని, చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రం ముందువరుసలో ఉందనీ అన్నారు.. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్యసంపదలో 29 శాతం మన రాష్ట్రం నుంచే ఉంటోందనీ, ఏపీ నుంచే 32 శాతం మత్స్య సంపద ఎగుమతులు జరుగుతున్నాయిఅని, మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోంది అని ఎమ్మెల్యే తెలిపారు. చేపల పెంపకం వల్ల వ్యాపారులకు ఎన్నో లాభాలున్నాయి అని, అలాగే పోషకాల కోసం ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే చేపలు తినాలి అని, మనుషుల్లో తెలివితేటలు, పిల్లల మెదడు చురుకుగా పనిచేయాలంటే చేపలు తినాలి అని మత్స్య శాఖ అధికారులు కూడా సూచిస్తున్నారు అని ప్రభాకర్ అన్నారు.

# కనపడుట లేదు



**కిర్లంపూడి, ఏప్రిల్ 27 (జనస్వరం)** : కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన వ్యక్తి కనబడటం లేదని కిర్లంపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. యడ్ల లక్ష్మణరావు (తండ్రి పేరు: వీర్రాజు, వయసు: 45 సంవత్సరాలు, కులం: కాపు) సింహాద్రిపురం గ్రామానికి చెందినవారు. అతను వివాహితుడిగా, వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక నెల క్రితం అతను ఆపరేషన్ చేయించుకున్న తరువాత ఇంటివద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. 2025 ఏప్రిల్ 26న ఉదయం 9.30 గంటలకు ఆధార్ కార్డు తీసుకొని ఇంటి నుండి ప్యాషన్ మోటార్ సైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని అతని భార్య యడ్ల గని లక్ష్మి కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎన్‌వి రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. పై ఫోటోలో ఉన్న యడ్ల లక్ష్మణరావు ఆచూకీ తెలిసినవారు, వెంటనే జగ్గంపేట సీఐ గారి సెల్ నంబర్ 94407 96529 లేదా కిర్లంపూడి ఎస్ఐ గారి సెల్ నంబర్ 94409 04834 కు సమాచారం అందించవలసిందిగా కోరుతున్నారు.

# టీడీపీ కార్యకర్తపై కత్తులతో దాడి

**(ఏబీఎన్ స్క్రోలింగ్) కాకినాడ** : పెద్దాపురంలో వైసీపీ గుండాల వీరంగం - టీడీపీ కార్యకర్త జార్జ్ చక్రవర్తిపై కత్తులతో దాడి - టీడీపీ కార్యకర్త చక్రవర్తికి తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు - జార్జ్ చక్రవర్తికి చెందిన 2.54 ఎకరాలు కొట్టేసేందుకు పెద్దాపురం వైసీపీ కార్యకర్తల స్కెచ్ - పొలంలో పంట కోస్తుండగా చక్రవర్తిపై కత్తులతో దాడి - వైసీపీ కార్యకర్తలు వెన్న విజయ చక్రవర్తి, ఆరెల్లి రాఘవ, పెదిరెడ్ల నాని, ఐతి మేరీ, కొత్తపల్లి సాయికుమార్ దాడికి పాల్పడినట్లు పోలీసులకు జార్జ్ చక్రవర్తి ఫిర్యాదు.

# సీతారాంపురంలో టిడిపి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

**నెల్లూరు, ఏప్రిల్ 27 (జనస్వరం)** : కాశ్మీర్లో అమాయక పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన మారణకాండను నిరసిస్తూ, టిడిపి సీనియర్ నాయకులు చింతల శ్రీనివాసులు, కళావతి ఆధ్వర్యంలో సీతారాంపురం మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల శ్రీనివాసులు మాట్లాడుతూ, పెహల్గాంలో అమాయకులైన 27 మందిని పొట్టన పెట్టుకున్న దారుణ ఘటనను









తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా, దాన్ని కూకటి వేళ్లతో పెకలించాలని, మతతత్వం మరియు తీవ్రవాదాన్ని రెచ్చగొట్టే విధానాలు దేశాన్ని ప్రాంతీయ, కుల, మత విభజనల దిశగా నడిపిస్తూ, దేశ సమగ్రతకు, ఐక్యతకు ప్రమాదం కలిగిస్తాయని వ్యాఖ్యానించారు. పాక్ ప్రేరేపిత తీవ్రవాదాన్ని పూర్తిగా అణిచివేయాలని డిమాండ్ చేశారు. గత రెండు నెలలుగా పాకిస్థాన్ మంత్రులు భారత్‌పై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ వచ్చినా, ఇంటెలిజెన్స్ విఫలమైందని, ఫలితంగా అమాయకులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. హత్యకు గురైన కుటుంబాలకు, గాయపడిన కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలివేల కుమార్, వెంగల శెట్టి వెంకటేశ్వర్లు, కానాల సిద్దయ్య, చంద్రారెడ్డి, ఎడమ ప్రవీణ్ కుమార్, నేలటూరి జాషువా, కాశీ రత్తయ్య, పిడతల శ్రీనివాసులు, కొడవటి కంటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# దాతృత్వాన్ని చాటుకున్న వాసగిరి మణికంఠ



**గుంతకల్, ఏప్రిల్ 27 (జనస్వరం)** : గుంతకల్ నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నిస్వార్థ కార్యకర్త అమర్ పెయింటింగ్ పనులు చేసుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు మిద్దిపైనుంచి కింద పడడంతో కాలు బెణికి గాయాలపాలయ్యాడు. ఈ విషయం జనసేన నాయకుడు మణికంఠ గారి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి అమర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. పరామర్శ సందర్భంగా, "మీరు చేసిన సేవలను మరచిపోము. మీకు జనసేన పార్టీ అన్నివేళలా అండగా ఉంటుంది," అని భరోసా కల్పిస్తూ తన వంతు బాధ్యతగా రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం మణికంఠ మాట్లాడుతూ, "ఏ కార్యకర్తకు కష్టాలు ఎదురైతే, వెంటనే నా దృష్టికి తీసుకురావాలి. నా వంతు సహాయం అందించడమే కాకుండా, పార్టీ లేదా కూటమి ప్రభుత్వ మాధ్యమంగా కూడా అవసరమైన సహాయ సహకారాలు అందేలా చూస్తాను," అని తెలిపారు.

# ప్రతి నీటి బొట్టు .. బంగారమే పొదుపుగా వాడుకుందాం

నీటిని పొదుపుగా వాడేవారు ధనాన్ని కూడా పొదుపుగా వాడుతారట! నీటిని దుబారా చేసే వారు డబ్బును కూడా అలానే దుబారా చేస్తారట. ఈ భూమి మీద లభిస్తున్న మొత్తం నీటిలో 97 శాతానికి పైగా సముద్రజలం. అది ప్రాణులకు ప్రత్యక్షంగా ఉపయోగపడేది కాదు. మరో రెండు శాతానికి పైగా మంచు రూపంలో ఉంది. మిగిలిన ఒక్క శాతంకన్నా తక్కువే ప్రాణులకు పనికివచ్చేది. అదే మంచినీరన్న మాట! ఇప్పుడా మంచినీటికి పెద్ద ముప్పు ఏర్పడింది. అధిక జనాభా తదితర వాస్తవాల వల్ల నీటి వినియోగం పెరిగి చాలీచాలని పరిస్థితి ఒకటైతే, దారుణమైన కాలుష్యం మరొకటి! వాతావరణం కాలుష్యం పెరిగి మంచుమీద ఒత్తిడి మొదలైంది. భూగోళం మీది సమతుల్యానికి మంచు కూడా ఒక ఆధారం. అది కాస్తా కరిగిపోతే, జలప్రళయం సంభవించి నేల తుడిచిపెట్టుకు పోతుంది. నీరే మన జీవనానికి ఆధారం. నదీ పరివాహక ప్రాంతాలలోనే నాగరికత, సంస్కృతీ అభివృద్ధి చెందటం మనకు తెలిసిన విషయమే! నీరు మనకు ఆహారం. నీరే మనకు ఆధారం. రవాణా వ్యవస్థకు కూడా మనం నీటిని వాడుకుంటున్నాం. నీటి కోసం జరుగుతున్న ఉద్యమాలను చూస్తున్నాం. రాబోయే కాలంలో వచ్చేవి 'జలయుద్ధాలే'! ప్రకృతితో ఇకనైనా పరిహాసాలు ఆపేసి, ప్రకృతి వనరులను అతి పవిత్రంగా చూసుకోవటం నేటి మన తక్షణ కర్తవ్యం. అడవులను ఆక్రమించుకుంటున్నాం. స్మశానాలను ఆక్రమించుకుంటున్నాం. చెరువులు ఇతర జలాశయాలను నగరాల్లో ఎప్పుడో ఆక్రమించారు హిరణ్యాక్షుడివర ప్రసాదులు! నిజం చెప్పాలంటే మనమే నీటిని తరిమివేసాం. చాలా నదులు అంతర్ధానం అయిపోయి, అంతర్వాహినులుగా ఉన్నాయి. వాటిలో మన రాష్ట్రంలోని శ్రీ కాళహస్తిలోని సువర్ణముఖి నది ఒకటి.

ఇటువంటి నదులు మనదేశంలో షుమారు 50కి పైగా ఉన్నాయని అంచనా! భూమిలోకి వెళ్ళిపోయిన ఆరావళీ పర్వత ప్రాంతాలలో శుష్కించిపోయిన అయిదు నదులను బతికించిన 'జలబ్రహ్మ' జలభాష, ఘోషను అర్థం చేసుకోగల మహామనీషి, రామన్ మెగసెసే అవార్డ్ గ్రహీత, తరుణ్ భారత్ సంఘ్ అధినేత అయిన శ్రీ రాజేంద్రసింగ్ ను గురించి మనలో ఎంతమందికి తెలుసు? క్షామపీడిత గ్రామసీమలకు నీటిని రప్పించి సస్యశ్యామలం చేసిన జలదాత ఆ మహానుభావుడు! ఆయన స్ఫూర్తితో తెలుగులో 'జలగీతం' అనే 110 పుటల దీర్ఘ కవితను(తెలుగులో వచ్చిన మొదటి దీర్ఘ కవిత ఇదే!) అద్భుతంగా వ్రాసి ఎందరినో ఉత్తేజపరచిన డాక్టర్. యన్. గోపి గారు. మనకు రోజుకి కనీసం 30-50 లీటర్ల పరిశుభ్రమైన, సురక్షితమైన నీరు అవసరం. కానీ ఇప్పటికీ 88. 4 కోట్ల మంది ( 884 మిలియన్ల మంది) ప్రజలకు సురక్షితమైన నీరు అందుబాటులో లేదు. వేసవి వస్తోందంటేనే భయమేస్తోంది. నీటి కొరత దడ పుట్టిస్తుంది. బిందెలతో బారులు తీరే జనాలు కనిపిస్తారు. నీరు లభించని ప్రాంతాలలో ఎదురయ్యే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. భూమి ఏర్పడినప్పుడు ఎంత నీరు ఉందో ఇప్పుడూ అంతే ఉంది. పెరగడం కానీ తరగడం కానీ కాలేదు. కానీ ఆ నీటిని వాడుకునే వారి జనాభా మాత్రం విపరీతంగా పెరిగిపోయింది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది నీటి కోసం కటకటలాడుతున్నారు. ఉన్న మంచినీటిని మనం పొదుపుగా వాడకపోగా కలుషితం కూడా చేస్తున్నాం. ప్రపంచంలో 500కు పైగా మంచినీటి నదులు కలుషితమైపోయాయి. ప్రపంచంలో భారీ యుద్ధాల్లో చనిపోయిన వారి కన్నా, కలుషిత నీటి వల్ల మరణించిన వారే ఎక్కువ. ఏడాదికి 40 లక్షల మంది కలుషిత నీరు తాగి చనిపోతున్నారు. ఒక కిలో బియ్యాన్ని పండించడానికి 5000 లీటర్ల నీరు అవసరమవుతుంది. అరకిలో కాఫీ తయారవడానికి 11, 000 లీటర్ల నీరు అవసరం. కార్పొరేట్ కంపెనీలు ఆరోగ్యానికి హాని కలిగించే శీతల పానీయాల కోసం వృథా చేస్తున్న మంచి నీటికి ఇక లెక్కే లేదు. కొన్ని రాష్ట్రాలు ఈ శీతల పానీయాలను నిషేధించాలని కూడా చూస్తున్నాయి. ప్రపంచ జనాభాలో భారత్ జనాభా 16 శాతంగా ఉంది. కానీ ప్రపంచ నీటి వనరుల్లో భారత నీటి వనరులు కేవలం నాలుగు శాతంగానే ఉన్నాయి. ప్రస్తుతమున్న వెయ్యి మిలియన్ల జనాభాకు తలసరి నీటి లభ్యత సంవత్సరానికి ఒక్కో వ్యక్తికి 1. 170 క్యూబిక్ మీటర్లుగా ఉంది. తీవ్రంగా ఉన్న నీటికొరత అవసరాలకు వాడుకునే వారి మధ్య ఘర్షణలకు దారి తీస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సమీప భవిష్యత్తులో నీటి యుద్ధాలు ఖాయమని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. మన దేశంలో మాత్రం ఇప్పటికే నదీ జల వివాదాలు తలెత్తుతున్నాయి. జల వివాదాలకు పెరుగుతున్న నీటి వినియోగమే ప్రధాన కారణం. వర్షాలు తగ్గడం, నదీ ప్రవాహంలో తేడా, అనుమతులు లేకుండా డ్యామ్లు నిర్మాణానికి ప్రయత్నించడం మరి కొన్ని కారణాలు. 2050 నాటికి బ్రహ్మపుత్ర, బారక్, తపతి నుంచి కన్యాకుమారి వరకు పశ్చిమ దిశలోకి ప్రవహించే నదుల్లో మాత్రమే తగినంత నీరు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. నీటి విలువను తెలిపే పవర్ పాయింట్ ప్రజంటేషన్ ను మరో మహామనీషి, మన మాజీ రాష్ట్రపతి శ్రీ అబ్దుల్ కలాంగారు తయారు చేసి ఎప్పుడో ప్రజెంట్ చేసారు.కానీ మనమే పట్టించుకోలేదు. వాటిని పట్టించుకోలేదు.

భారతదేశ చరిత్రలో మునుపెన్నడూ లేనంతటి తాగునీటి ఎద్దడి ఏర్పడింది. దేశంలో సుమారు 60 కోట్ల మందిని తాగునీటి కొరత తీవ్రంగా పీడిస్తోంది.ఇది ఇక్కడితో ఆగిపోలేదని, ముమ్ముందు సమస్య మరింత తీవ్రం కానుందని నీతి ఆయోగ్ తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలోని 24 రాష్ట్రాల్లో పరిశీలన జరిపి నీతి ఆయోగ్ ఈ విషయం వెల్లడించింది. అంతేకాదు.. 21 నగరాలు తాగునీటి విషయంలో పెను ప్రమాదం అంచున ఉన్నాయని హెచ్చరించింది. ఆయా నగరాల్లో తాగునీటి అవసరాలు రోజురోజుకీ పెరుగుతుండగా అక్కడి భూగర్భ జలాలు మాత్రం అంతకంటే వేగంగా అడుగంటుతున్నాయని తేల్చింది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆ 21 నగరాల్లో 2020 నాటికి భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతాయని హెచ్చరించింది. నీటి ఎద్దడి ప్రభావం వల్ల ఆహార భద్రతకు ముప్పు కలగొచ్చని నీతి ఆయోగ్ చెప్పింది.

దేశంలో వినియోగమయ్యే నీటిలో 80 శాతం వ్యవసాయానికే ఉపయోగిస్తుండడంతో నీటి కొరత ప్రభావం ఆహార ఉత్పత్తులపైనా పడనుంది. దేశంలోని అనేక నగరాలు, పట్టణాలు ఏటా వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొంటుంటాయి. ఇంటింటికీ తాగునీటి సరఫరా చేసేలా సువ్యవస్థీకృతమైన ఏర్పాట్లు లేకపోవడం వల్ల ఏటా ఈ పరిస్థితి తప్పడం లేదు.వేసవి వచ్చిందంటే పబ్లిక్ కుళాయిలు, వీధుల్లోకి వచ్చే నీళ్ల ట్యాంకర్ల వద్ద బిందెలతో బారులు తీరడం సర్వసాధారణమైపోయింది. ప్రభుత్వం అరకొరగా సరఫరా చేసే నీరు చాలక ప్రయివేటు ట్యాంకర్లనూ ఆశ్రయిస్తుంటారు. ఇక గ్రామాల్లో అయితే స్వచ్ఛమైన తాగునీరు దొరక్క ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోందని.. దేశవ్యాప్తంగా ఏటా 2 లక్షల మంది అపరిశుభ్రమైన నీరు తాగడం వల్ల రోగాలకు గురై మరణిస్తున్నారని ఈ నివేదిక వెల్లడించింది. మరోవైపు పట్టణాలు, నగరాలు విస్తరిస్తుండడంతో పట్టణాల్లోని జలవనరులపై మరింత భారం పెరుగుతోంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 2030 నాటికి దేశంలో తాగునీటి సరఫరా కంటే అవసరం



రెండింతలు ఉంటుందని అంచనా. అంతేకాదు... నీటి కొరత కారణంగా దేశ స్థూల దేశీయోత్పత్తిలో 6 శాతం తగ్గుదల నమోదు కావొచ్చని అంచనా వేసింది. అయితే, జలయాజమాన్యం విషయంలో కొన్ని రాష్ట్రాలు మిగతా రాష్ట్రాల కంటే మెరుగైన స్థితిలో ఉన్నాయి. నీతి ఆయోగ్ జలయాజమాన్య సూచిలో గుజరాత్ ప్రథమ స్థానంలో నిలవగా.. మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. అధ్యయనం చేసిన 24 రాష్ట్రాల్లో 15 గత ఏడాది కంటే కొంత ప్రగతి సాధించాయి. మరోవైపు జలయాజమాన్యం విషయంలో అట్టడుగున ఉన్న ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోనే దేశ జనాభాలో సుమారు సగం మంది నివసిస్తుండడం ఆందోళనకర అంశం. అంతేకాదు.. వ్యవసాయ ఉత్పాదకతా ఈ రాష్ట్రాల్లోనే ఎక్కువ. ఇలాంటి రాష్ట్రాలు జలయాజమాన్యంలో వెనుకబడడంపై నీతి ఆయోగ్ నివేదిక ఆందోళన వ్యక్తంచేసింది.జల వినియోగం, యాజమాన్యం విషయంలో కుటుంబాలు, పరిశ్రమలకు సంబంధించిన కచ్చితమైన సమాచారం అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వాలు ఈ పరిస్థితిని చక్కదిద్దడంలో ఇబ్బంది పడుతున్నాయని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది.

ప్రభుత్వాలు ఇలా ఆలోచించకపోవటం వల్లే సహజ వనరు అయిన నీరు ఇప్పుడు వ్యాపార వస్తువుగా మారింది. డబ్బున్నవాళ్లకు కావాల్సి నంత దొరుకుతోంది. పేదలు కిలో మీటర్ల దూరం నుంచి తెచ్చుకోవాల్సి న పరిస్థితి తలెత్తింది. నీటిని పొదుపు చేస్తే సమాజానికి మేలు చేసినట్లే. ప్రకృతి ఇచ్చిన సంపద, వరం నీరు. అంత విలువైన నీటిని వృథా చేయటం ఒక విధంగా పాపం. నీరు సమృద్ధిగా ఉంటే సాగు బాగుంటుంది. కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు , ధాన్యం బాగా పండుతాయి. అందరికీ పని, ఆహారం దొరుకుతాయి. డబ్బు సంపాదిస్తారు. ఇలా చెప్పుకుంటూ పోతే నీటి ఉపయోగాలెన్నో. నీటికి సహజ వనరులైన చెరువులను, సరస్సులను, నదులను మనం సంరక్షించుకోవాలి. వ్యర్థాల నిర్వహణలో లోపాలు, పెరుగుతున్న రసాయన ఎరువుల, కల్తీ పురుగు మందుల వాడకంతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్ లలో భూగర్భ జల మట్టా లు పూర్తిగా తగ్గిపోయాయి. ఫలితంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసే వీల్లేక కుటుంబాలతో కలిసి నగరాలకు వలస వెళ్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో నీటి కోసం యుద్ధాలు జరిగే ప్రమాదం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా 500కు పైగా మంచినీటి నదులు కలుషితమయ్యాయి. భారీ యుద్ధాల్లో చనిపోయిన సైనికుల కన్నా కలుషిత నీరు తాగి మరణించినవారే ఎక్కువంటే అతిశయోక్తి కాదు. ఏడాదికి 40 లక్షల మంది కలుషిత నీరు తాగి మృత్యువాత పడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది.

ప్రకృతి ఇచ్చిన సంపద, వరం నీరు. అంత విలువైన నీటిని వృథా చేయటం ఒక విధంగా పాపం. నీరు సమృద్ధిగా ఉంటే సాగు బాగుంటుంది. కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు , ధాన్యం బాగా పండుతాయి. అందరికీ పని, ఆహారం దొరుకుతాయి. డబ్బు సంపాదిస్తారు. ఇలా చెప్పుకుంటూ పోతే నీటి ఉపయోగాలెన్నో. నీటికి సహజ వనరులైన చెరువులను, సరస్సులను, నదులను మనం సంరక్షించుకోవాలి. వ్యర్థాల నిర్వహణలో లోపాలు, పెరుగుతున్న రసాయన ఎరువుల, కల్తీ పురుగు మందుల వాడకంతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్ లలో భూగర్భ జల మట్టా లు పూర్తిగా తగ్గిపోయాయి. ఫలితంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసే వీల్లేక కుటుంబాలతో కలిసి నగరాలకు వలస వెళ్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో నీటి కోసం యుద్ధాలు జరిగే ప్రమాదం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా 500కు పైగా మంచినీటి నదులు కలుషితమయ్యాయి. భారీ యుద్ధాల్లో చనిపోయిన సైనికుల కన్నా కలుషిత నీరు తాగి మరణించినవారే ఎక్కువంటే అతిశయోక్తి కాదు. ఏడాదికి 40 లక్షల మంది కలుషిత నీరు తాగి మృత్యువాత పడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది.

" జలం మన బలం. నీటిని వృథా చేయకండి. నీటిని వృథాచేస్తే ఆఖరికి 'కన్నీరు'కూడా కరువవుతుంది! "